క్లుప్తంగా

రేపటి నుంచి అంకాళమ్మ శరన్నవరాత్రులు

రాపూరు: వేపినాపి సమీపంలోని పోతుకొండపై వెలసిన అంకాళమ్మ తల్లికి గురువారం నుంచి శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం అంకాళమ్మ అలంకరణ, 4న బాలత్రిపుర సుందరిదేవి, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణదేవి, 7న లలితా త్రిపుర సుందరి, 8న సరస్వతిదేవి, 9న మహాలక్ష్మిదేవి, 10న దుర్గాదేవి అలంకరణ, 11న మహిషాసుర మర్దినిగా, 12న రాజరాజేశ్వరిదేవిగా అలంకరిస్తామని తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

రేపటి నుంచి శ్రీమల్లికాంబ ఆరాధనోత్సవాలు

నాయుడుపేట టౌన్: ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో రహదారి పక్కనే వెలసిఉన్న భగవతి శ్రీమల్లికాంబ అమ్మవారి ఆరాధన బ్రహ్మోత్సవాలను 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు అమాస రామనారాయణ మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంవద్ద కలశ స్థాపన, ఆది పరాశక్తి, చండీహోమా పూజలు, చివరి రోజున పుష్ప యాగం, నగరోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

9 ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెంకటగిరి రూరల్ : ఇసుక అక్రమ రవాణాపై స్థానిక పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసిన ఘటన వెంకటగిరి–నాయుడుపేట మార్గం, వెంకటగిరి రూరల్ మండలం, పంజాం గ్రామ మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు కథనం.. పూండి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు నాయుడుపేట–వెంకటగిరి మార్గంలోని పంజాం గ్రామ సమీపంలో పోలీసులు కాపుకాసి దాడులు నిర్వహించారు. ఇందులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ ట్రాక్టర్లను ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉంచారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉపాధి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: మండలంలోని రామసాగరం, సైదాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారంలో ఒక్క రోజు కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏపీఓ చంద్రయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది విద్యార్థులు



సత్తా చాటిన విద్యార్థులు

వాకాడు: నెల్లూరులో జరిగిన అండర్–19 పోటీలలో వాకాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 18 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విజయకుమార్ మాట్లాడుతూ అండర్–19 విభాగంలో టెన్నిస్, క్రికెట్, రెజ్లింగ్, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, రగ్బీ క్రీడాపోటీలలో 14 మంది, అండర్–17 విభాగంలో డిస్కస్‌త్రో, రన్నింగ్ పోటీలలో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.

సెలవుల్లో బడులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గూడూరు రూరల్: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు వేర్వేరుగా నిరసన చేపట్టారు. అనంతరం విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శశికుమార్, యశ్వంత్, సాయి భగత్ పాల్గొన్నారు. నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీపతి చిన్నా తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



మద్యం దుకాణాల వద్ద నిరసన

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటీకరణ చేసేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వెంకటగిరిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు మంగళవారం మద్యం దుకాణాలను మూసివేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తమ పొట్ట కొట్టే దిశగా మద్యంషాపులను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు ఆ దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లను యథావిధిగా కొనసాగించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు శ్రీకాంత్, చిరంజీవి, చంద్ర, మణికంఠ, శ్రీహరి, ప్రసాద్, చెన్నకేశవులు, వెంకటస్వామిరెడ్డి, వెంకటేష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు మూత

కోట: కోట, విద్యానగర్‌లో మంగళవారం మద్యం దుకాణాలు మూత పడ్డాయి. మద్యంషాపుల్లో పని చేసే ఉద్యోగులు తమ నిరసనలో భాగంగా షాపులను తెరవలేదు. ప్రభుత్వం షాపులను ప్రైవేటు పరం చేస్తుండడంతో ప్రస్తుతం షాపుల్లో పనిచేస్తున్న వారిని తొలగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే వారు మద్యం షాపులకు తాళాలు వేసి హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్నం మూడు గంటల వరకు షాపులు తెరుచుకోలేదు. చివరకు ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఉద్యోగులతో చర్చలు జరిపి షాపులను ఆలస్యంగా తెరిచారు.

ఇసుక క్వారీలను ప్రారంభించండి



సైదాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

సైదాపురం: ఇసుక క్వారీలను వెంటనే ప్రారంభించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అనురాధకు వినతిపత్రం రూపంలో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేక పనులు కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులను ప్రస్తుత ప్రభుత్వం నిరాశకు గురి చేసిందన్నారు. కార్యక్రమంలో నేతలు కె.చెంగల్‌రావు, డి.శ్రీనివాసులు, కె.ఈశ్వరయ్య, పి.వెంకటరమణయ్య తదితరులున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



కరపత్రాలను విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

గూడూరు రూరల్: చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించినట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భారతి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలపై అపోహలను తొలగించడంతో పాటుగా, సైన్సులోని పలు విషయాలపై అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తం, సుబ్బారావు, ప్రభాకర్, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించండి



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

సూళ్లూరుపేట: హిందూ దేవాలయాలను రాజకీయానికి వాడుకుంటూ హైందవ ధర్మాన్ని నాశనం చేస్తున్నారని, వాటిని హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని సూళ్లూరుపేట విశ్వ హిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రదర్శనగా వెళ్లి ఆర్డీఓ ఈతమాకుల కిరణ్మయి యాదవ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. తిరుమల పుణ్యక్షేత్రంలో లడ్డూలో కల్తీ జరిగిందని రాజకీయ కోణాలు బయట పడడంతో హిందూ ఆలయాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయవద్దని వినతిపత్రంలో పేర్కొన్నారురు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కమ్మిరెడ్డి, సుంకర ప్రతిమ, శివప్రసాద్‌రెడ్డి, నారాయణ, పద్మజ, మమత, శారద, కళావతి, విజయ, శాంతకుమారి, దేహి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ హైమావతి

సైదాపురం: రైతులు పంటల సాగులో తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను పాటించాలని కేవీకే శాస్త్రవేత్త సుచేంద్ర కోరారు. మండల కేంద్రమైన సైదాపురం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏఓ హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఉద్యాన శాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ డ్రిప్ పద్ధతిలో నాణ్యమై దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. రైతులు కూలీలకు, పురుగుల మందుకు అధికంగా వెచ్చిస్తుండడంతో పెట్టుబడులు అధికం అవుతున్నాయన్నారు. నిమ్మ తోటల విషయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

రబీ సీజన్‌లో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరి రూరల్: రబీ సీజన్‌లో వరి పంట సాగు చేసే రైతులు మెళకువలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాతలూరు, వల్లివేడు గ్రామంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో ఆర్ఎన్ఆర్ 15048 వరి పంట అనువైనదన్నారు. పంట సాగులో తెగుళ్ల నివారణ, సాగు మెళకువలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఏఓ సుజాత, ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్, కేవీకే శాస్త్రవేత్తలు నాగార్జునరెడ్డి, విస్తరణ అధికారి రామ్మోహన్, సహాయకులు రాజ్యలక్ష్మి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలే లక్ష్యం



పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెళ్లకూరు: కూటమి పాలనలో ప్రజల కష్టాలు గుర్తించి ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడమే లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం తాళ్వాయిపాడు గ్రామంలో పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. గ్రామంలోని పెన్షనర్లకు నగదు పంపిణీ చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆమె స్పష్టం చేశారు. దీపావళికి మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు అందిస్తామన్నారు. ఇప్పటికే క్రమం తప్పకుండా పింఛన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం త్వరలోనే అమలవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు శ్రీనివాసులు, హరి, భాస్కర్, బాలయ్య పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మంగళవారం ఐఈఈఈ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కోడ్ మానియా, డీ బగ్గింగ్ తదితర అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఓడీలు రాజశేఖర్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

95 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ, మండలంలో పింఛన్లను మంగళవారం సాయంత్రానికి 95 శాతానికి పైగా పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచనల మేరకు సచివాలయ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును పంపిణీ చేశారు. కారుమంచివారి కండ్రిగ గ్రామంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్ర రెడ్డి తదితర నాయకులు లబ్ధిదారులకు పింఛన్‌ల అందించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో 4141 మందికిగాను సాయంత్రానికి 3990 పింఛన్‌లను పంపిణీ చేశారు.

కండలేరులో 23.672 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 23.672 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9650 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1250, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గూడూరు విద్యార్థిని



రాష్ట్ర పోటీలకు ఎంపికైన కౌసల్యతో పీడీ విజయలక్ష్మీ

గూడూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు మంగళవారం పాఠశాల పీడీ సీహెచ్ విజయలక్ష్మీ తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా జిల్లా స్థాయిలో అండర్–14 విభాగంలో బాలికల ఫుట్‌బాల్ జట్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 9వ తరగతి చదివే విద్యార్థిని కౌసల్య రాష్ట్రస్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థిని కౌసల్యను పలువురు అభినందించారు.

ముమ్మరంగా సర్వే పనులు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి ఆక్రమణపై గత వారం రోజుల నుంచి సర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పక్షం రోజుల కింద 'ఆక్రమణలో ప్రభుత్వ భూమి' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక తహసీల్దార్ శైలకుమారి స్పందించారు. మండల సర్వేయర్ రామారావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం సర్వేయర్లతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్నారు. నెలబల్లి రెవెన్యూలోని సర్వే నంబర్లు 319, 320, 321, 322, 324, 325, 326, 327, 328, 331, 332 తదితర వాటిల్లో 80ఎకరాల పైబడి ప్రభుత్వ భూమి బడా భూస్వాముల ఆధీనంలో ఉన్నట్లు గ్రామస్తులు, రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 100 ఎకరాలను సర్వే చేయగా ప్రభుత్వ భూమి ఆరు ఎకరాల పైబడి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే పూర్తి చేసి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ఈశ్వరయ్యస్వామి హుండీ రాబడి రూ.9.82 లక్షలు

దక్కిలి: మండలంలోని దేవుని వెల్లంపల్లి సమీపంలో వెలసియున్న శ్రీస్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి దేవస్థానానికి సంబంధించి హుండీ ద్వారా రూ.9,82,800 రాబడి వచ్చినట్లు ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 155 రోజులకు సంబంధించి స్వామివారి హుండీ లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు చేయూత



ఫలసరుకులు, దుస్తులు స్వీకరిస్తున్న వృద్ధ దంపతులు

చిట్టమూరు(వాకాడు): మండల కేంద్రమైన చిట్టమూరు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు మంగళవారం వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. గ్రామానికి చెందిన రుక్మిణమ్మ కుటుంబ సభ్యులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఎస్‌వి కృష్ణమూర్తి, యమునాదేవి అనే వృద్ధ దంపతులకు ఫలసరుకులు, కూరగాయలు, దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, దీవి తేజోవతి పాల్గొన్నారు.

వరిసాగులో నారుమడి కీలకం

వాకాడు: వరిలో తెగుళ్ల నివారించడంతోపాటు అధిక దిగుబడులు రావాలంటే సాగులో నారుమడి కీలకమని మండల వ్యవసాయశాఖాధికారి దీప అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం వాకాడు గొల్లపాళెం పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడి తయారు చేయడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులను దీప రైతులకు వివరించారు. అనంతరం వాకాడు పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ రమణయ్య పాల్గొని పశువుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు, నట్టల నివారణ మందులను వివరించారు.

చైన్ స్నాచింగ్

గూడూరురూరల్ : పట్టణంలోని చెన్నూరు ప్రాంతంలో మంగళవారం ఓ మహిళ మెడలోని 5 సవర్ల బంగారు గొలుసును బైక్ వస్తున్న ఇద్దరు యువకులు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహంపై విచారణ



విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

చిల్లకూరు: జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందిన ఫిర్యాదు మేరకు మండలంలోని దేవరవేమూరు గ్రామంలో బాల్య వివాహంపై అధికారులు విచారణ చేపట్టారు. బూదనం గ్రామానికి చెందిన ఓ యువకుడికి సైదాపురం మండలం దేవరవేమూరు గ్రామంలోని బంధువులకు చెందిన మైనర్ బాలికతో నాలుగు నెలల క్రితం వివాహం జరిపించేందుకు రెండు కుటుంబాల వారు సిద్ధపడ్డారు. అయితే అప్పట్లోనే అధికారులకు సమాచారం రావడంతో వివాహాన్ని నిలిపేశారు. అయితే జిల్లా కలెక్టర్ మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాను బూదనం గ్రామంలో విచారణ చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో సబ్‌కలెక్టర్ తోపాటుగా చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీలతో కలసి గ్రామంలో విచారణ చేపట్టారు. అధికారులు వచ్చి అడ్డుకోవడంతో అప్పటి నుంచి వివాహం చేసుకోలేదని యువకుడు, అతని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ జ్యోతికిరణ్, వీఆర్ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరవేమూరులోనూ విచారణ

ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా సైదాపురం మండలం దేవరవేమూరు గ్రామంలో కూడా విచారణ చేపట్టారు. సైదాపురం తహశీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు మంగళవారం గ్రామ వీఆర్ఓ రఘు క్షేత్ర స్థాయిలో విచారణ చేశా మైనర్ బాలికకు వివాహం కాలేదని నిర్ధారించారు. వారి వద్ద నుంచి రాత పూర్వకంగా సమాచారం తీసుకున్నారు.

పక్షుల కేంద్రం టికెట్ కౌంటర్ ప్రారంభం



నేలపట్టు పక్షుల కేంద్రంలో తెరుచుకున్న ప్రధాన గేట్లు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ప్రధాన గేటు వద్ద ఉన్న సందర్శకుల టికెట్ కౌంటర్‌ను మంగళవారం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు ప్రారంభించారు. వలస పక్షుల సీజన్ అక్టోబర్‌లో ప్రారంభమై ఏప్రిల్‌కు ముగిసిపోతుంది. సీజన్ ఆరంభం కావడంతో కౌంటర్‌ను ప్రారంభించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలయ్య తెలియజేశారు. సందర్శకుల వేళలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అని తెలిపారు. ప్రవేశ రుసుం అయితే పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5, బైక్ రూ.20, ఆటో రూ.50, జీపు, కారు రూ.100, బస్సు, మినీ బస్, టెంపో వంటి వాహనాలకు రూ.250, కెమెరా రూ.100, విదేశీయులకు ప్రవేశ రుసుం రూ.500, విదేశీయుల కెమెరాకు రూ. 200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే పక్షుల కేంద్రంలో వలస పక్షులు లేకుండా టికెట్ కౌంటర్ ప్రారంభించడం ఎందుకని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన



ఏకొల్లులో మాట్లాడుతున్న ఏఓ సుభాషిణి

దొరవారిసత్రం: ఏకొల్లు, వేణుంబాకం గ్రామాల్లో స్థానిక వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగుపై పచ్చిరొట్ట ఎరువు నుంచి పంట చేతికి అందేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ సుభాషిణి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు కలియదున్నేటప్పుడు సూపర్ వేసుకోవాలన్నారు. వరి విత్తన శుద్ధి బీజామృతంతో కాని, సూడోమోనస్ కాని, ట్రిసోక్లోజీతో కాని చేయాలని రైతులకు వివరించారు. డీఏపీ ఎరువును పైపాటు వేయరాదన్నారు. అదే విధంగా ఉద్యాన శాఖ హెచ్ఓ యామిని మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో కూరగాయలు పండించే రైతులకు విత్తనాలను సబ్సిడీ కింద అందిస్తామన్నారు. బిందు, తుంపర సేద్యం కింద ఐదు ఎకరాల్లోపు సేద్యం చేసే రైతులకు 90శాతం సబ్సిడీతో అంతకంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకు 70శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నరేష్, ఎంపీహెచ్ఈఓ భారతి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి



భూసార పరీక్షల కార్డులు పంపిణీ చేస్తున్న ఏడీఏ గోపినాయక్

గూడూరు రూరల్: రైతులు తక్కువ పెట్టుబడి పెట్టి అధిక ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నట్టు గూడూరు ఏడీఏ గోపినాయక్ తెలిపారు. రూరల్ పరిధిలోని పారిచెర్లరాజుపాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు అందించే సంక్షేమం, రాయితీలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు, విత్తనశుద్ధి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. రసాయన ఎరువులు విపరీతంగా వాడితే మొదటికే మోసం వస్తుందన్నారు. అనంతరం భూసార పరీక్షల కార్డులు అందించారు. అధికారులు చెంచురెడ్డి, కార్తీక్, డాక్టర్ సుదర్శన్, మైక్రో ఇరిగేషన్ అధికారి సంధ్య, వ్యవసాయ సహాయకులు శివ, శ్యాంసన్ పాల్గొన్నారు.